క్లుప్తంగా

వర్షం కోసం ప్రత్యేక పూజలు



భ్రమరాంబా మల్లికార్జునస్వామి శివలింగానికి పాలాభిషేకం చేసి పూజిస్తున్న గ్రామస్తులు

పగిడ్యాల: మండలంలో వర్షాభావం నెలకొని ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలు వాడబారి పోతున్న నేపథ్యంలో మండలంలోని నెహ్రూనగర్ గ్రామ ప్రజలు గ్రామంలోని దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. సోమవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి,ఆంజనేయస్వామి, శివాలయంలోని శివలింగానికి, ఈర్లస్వామికి, నాభి శిలకు పాలాభిషేకం, జలా భిషేకం చేశారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

పాములపాడు: జగనన్న సురక్ష శిబిరానికి సంబంధించి గ్రామంలో పకడ్బందీగా సర్వే చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదేశించారు. సోమవారం మండలంలోని వేంపెంట, జూటూరు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి వారితో మాట్లాడి ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయించాలన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసనాయుడు, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు వేయించాలి

పగిడ్యాల: అంధకారంలో మగ్గిపోతున్నాం.. విద్యుత్ స్తంభాలు వేసి వీధిలైట్లు అమర్చాలని పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు మహిళలు తహసీల్దార్ భారతికి అర్జీ ఇచ్చి మొరపెట్టుకున్నారు. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, మహేశ్వరి, మరియమ్మలు సోమవారం పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అర్జీ సమర్పించారు.

అమరులకు నివాళి

నందికొట్కూరు: కారంచేడులో ఆధిపత్య, అహంకార దాడుల ఘటనకు 38 ఏళ్లు వచ్చాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు గుర్తు చేశారు. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కారంచేడు ఘటనలు అసువులు బాసిన వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శివ, మద్దిలేటి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల రైతు శిక్షణా కేంద్రం బీటీఎమ్ ఉమాదేవి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని మల్యాల గ్రామంలో రైతులకు మొక్కజొన్న, సోయాబీన్ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, నాయకులు ఎల్లనాయుడు, బాషా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

నందికొట్కూరు: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి నవనంది హైస్కూల్ విద్యార్థిని ఎంపికై నట్లు స్కూల్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని నవనంది హైస్కూల్‌లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని షేక్ సేహజ్రబీన్‌ను కరస్పాండెంట్, చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వేను వేగవంతం చేయాలి

నందికొట్కూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో ఎల్‌సీడీఎస్ సర్వేను ఆరోగ్య సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం మల్యాల గ్రామంలో జరుగుతున్న ఎల్‌సీడీఎస్ సర్వేను ఆయన పరిశీలించారు. ఎంపీహెచ్‌ఏ వెంకటలత, ఆశావర్కర్లు లలితమ్మ పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే చర్యలు

మహానంది: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీనాయక్ హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలంలో 2022–23 ఏడాదికి సంబంధించి జరిగిన పనులపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ ఏడాదికి మొత్తం రూ. 10.08 లక్షల పనులు జరిగినట్లు తెలిపారు. ఎంపీపీ సంజీవరెడ్డి, జెడ్పీటీసీ బారెడ్డి రామతులశమ్మ, వైస్ ఎంపీపీ రాగాల రమణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కొత్తపల్లి: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యురాలు దీపానాగవేణి సూచించారు. సోమవారం మండలంలోని బావాపురం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

కొండచిలువ కలకలం



భారీ కొండచిలువను పట్టుకున్న మోహన్

మహానంది: మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ గ్రామంలో హరి ఇంటి వద్ద సోమవారం రాత్రి సుమారు 10 అడుగులు ఉన్న కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించగా అతను కొండచిలువను పట్టుకొని అడవిలో వదిలేశాడు.

అమ్మ ఒడి.. ఆనందాల జడి

- తల్లుల బ్యాంకు ఖాతాల్లో నాలుగో విడత నగదు జమ
- నందికొట్కూరు నియోజకవర్గంలో 25, 560 మంది లబ్ధిదారులు
- రూ.33.228 కోట్లు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నందికొట్కూరు: పేద విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వరంగా మారింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా అండగా నిలిచి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసింది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. ఏటా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 15 వేల ఆర్థిక సాయం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నాలుగో విడతగా జూన్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లుల ఖాతాలో నగదును జమచేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేద విద్యార్థుల కోసం పథకాలు

విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల చదువులు భారం కాకుండా పూర్తి బాధ్యతలు ప్రభుత్వమే తీసుకొని, ఆయా పథకాలను అమలు చేస్తూ విద్యార్థుల భవిష్యతుకు బాటలు వేస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా సర్కారు బడులను తీర్చిదిద్దుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఉండాలన్న ఉద్దేశంతో విద్యాకానుక అందించింది. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న విప్లవాత్మక సంస్కరణలు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ఫలితంగా బడి బయట పిల్లలను సైతం ప్రభుత్వ బడి బాట పడుతున్నారు.

అమ్మ ఒడి పథకం లబ్ధిదారుల వివరాలు మండలాల వారీగా..

మండలం	లబ్ధిదారులు	విడుదలైన నగదు రూపాయల్లో
నందికొట్కూరు	7889	10,256
జూపాడుబంగ్లా	3,546	4,610
కొత్తపల్లి	3,063	3,982
మిడుతూరు	3,980	5,174
పగిడ్యాల	3,058	3,975
పాములపాడు	4,024	5,231
మొత్తం	25,560	33, 228

విద్యార్థుల తల్లులకు ప్రభుత్వం అండగా

దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా నాలుగో విడతగా ప్రభుత్వం అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో నగదును జమ చేశారు. ఈ ఏడాది అమ్మ ఒడి నాలుగో విడతగా నియోజకవర్గంలో 72 గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయా పాఠశాలల్లో 25, 560 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 33. 228 కోట్లు జమ అయ్యాయి.

టాయిలెట్ల నిర్వహణకు రూ.వెయ్యి..

అమ్మఒడి విడుదలయ్యే రూ.15వేలల్లో.. రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. మిగిలిన రూ.2వేలను.. డిస్ట్రిక్ట్ టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (డీటీఎంఎఫ్)కు రూ. వెయ్యి, డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (డీఎస్ఎంఎఫ్)కు రూ. వెయ్యి జమ చేస్తుంది. ఇలా విద్యార్థులకు వసతులు కల్పించడంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తుంది. జిల్లా కలెక్టర్ నియంత్రణలో డీటీఎంఫ్, డీఎస్ఎంఎఫ్ నిర్వహించబడుతాయి.



పిల్లల తల్లులకు అమ్మఒడి నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్(ఫైల్)

పిల్లల చదువుకు భయం లేదు



మా అబ్బాయి కదిరి నందు కొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ, తరగతి చదువుతున్నాడు. గతేడాది అమ్మ ఒడి పథకంలో వచ్చిన సొమ్ముతో మా పిల్లల చదువుకు కావాల్సిన వస్తువులన్నీ కొనుగోలు చేశాను. ప్రతి సంవత్సర పుస్తకాలు, తదితర వస్తువులు కొనుగోలు చేసేందుకు ఎంతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో పిల్లల చదువుకు భయమే లేదు. అమ్మ ఒడితో ఆర్థిక ఇబ్బంది తీరింది. జగనన్న విద్యాకానుకతో పుస్తకాలు కొనే అవస్థ తప్పింది.

– కదిరి మేరమ్మ జీ.వీరాపురం, కొత్తపల్లి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మా అబ్బాయి సాయి ఉదయ్ నందికొట్కూరులోని విజయవాణి స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నా డు. నా కుమారుడికి అమ్మ ఒడి పథకం వర్తించడంతో నా బ్యాంకు ఖాతాలో రూ, 15వేలు జమయ్యా యి. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు ఓ వరంగా మారింది. సీఎం వైఎస్ జగనన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పేదల విద్యార్థుల భవితకు బాటల వేసే బాధ్యతను తన భుజాలకెత్తుకున్న సీఎం వైఎస్ జగనన్నకు అమ్మలందరూ రుణపడి ఉంటాం.

– తెలుగు రేణుకమ్మ శాతనకోట

కులమతాలకు అతీతంగా పథకాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బాపనంతపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రధాన ధ్యేయం అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని బాపనంతపురం గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అర్హత ఉంటే చాలు పక్కాగృహాలు, ఇళ్లస్థలాలు, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

ప్రజల నుంచి విశేష స్పందన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, శివరామ్, విజయచౌదరితో పాటు ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. గజమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి గ్రామస్తులు దారిపొడవునా పూలు చల్లుతూ స్వాగతించారు. మహిళలు తమకు పింఛన్లు , ఇళ్ల స్థలాలు లాంటి చిన్న చిన్న సమస్యలు అడగడంతో ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, విజయచౌదరి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పువ్వాడ భాస్కర్, సురేష్, రషీద్, రాజేష్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుడిలా..

కరోనా మహమ్మారి ఫస్ట్ వేవ్ సమయంలో మహిళకు కూరగాయలు అందిస్తున్న యువకుడు వలంటీర్ రమేష్. లాక్‌డౌన్‌తో పగలే బయటకు రానిచ్చే వారు కాదు. అలాంటిది తన పరిధిలోని చెంచు కాలనీలో కరోనా పరీక్షలు చేయించడం, పాజిటివ్ రోగులను 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాల క్వారంటైన్ తరలించడం. హోం ఐసోలేషన్‌లో ఉన్న వారికి మందులు ఇంటి వద్దకు అందించేవాడు. ఈయనకు కేటాయించిన కుటుంబాలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు చేరవేసి కుంటుంబ సభ్యుడిగా తోడుగా నిలిచాడు.

– నందికొట్కూరు



కరోనా సమయంలో ఇంటి వద్దకు వెళ్లి కూరగాయలు అందిస్తున్న వలంటీర్ రమేష్

కరోనా సమయంలో వలంటీర్ సేవలు మరువలేం



కరోనా సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. నాకు చిన్న పిల్లలు ఉన్నారు. అలాంటి సమయంలో మాకు అండగా నిలబడింది వలంటీర్ రమేష్ మాత్రమే. ఇంటికి కూరగాయలు, నిత్యావసర సరుకులు, వస్తువులు తెచ్చి ఇస్తూ ఏ లోటు రానివ్వకుండా చూసుకున్నారు.

– రంగమ్మ, చెంచుకాలనీ

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఎంఈఓ మౌలాలి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, ఎంఈఓలు

మిడుతూరు: విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి అన్నారు. మిడుతూరు ఎంఈఓగా 10 సంవత్సరాలు విధులు నిర్వహించిన మౌలాలి కర్నూలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బదిలీపై వెళ్లారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మిడుతూరు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామిరెడ్డి అధ్యక్షతన ఎంఈఓ మౌలాలికి, అదేవిధంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ ప్రమోషన్‌పై బదిలీపై వెళ్లిన వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మౌలాలి మిడుతూరు ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలమందలపాడు, దేవనూరు, వీపనగండ్ల, కడుమూరు (ఉర్దూ) పాఠశాలలను జెడ్పీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయించారన్నారు. మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషిచేశారని ఆయన సేవలను కొనియాడారు. అలాగే ఎంఈఓ దంపతులను మండల ఉపాధ్యాయులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నబి రసూల్, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, చౌట్కూరు సర్పంచ్, స్థానిక ఉప ససర్పంచ్ తువ్వా లోకేశ్వర రెడ్డి, మదార్‌సాహెబ్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడి, ఎంఈఓ–2 శ్రీనాథ్, హెచ్ఎం సాయితిమ్మయ్య, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

మహానంది అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



శిల్పా కార్తీక్ రెడ్డికి మెమొంటో అందిస్తున్న ఈఓ

మహానంది: మహానందిని సుందరంగా తీర్చి దిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత శిల్పా కార్తీక్ రెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఆయకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సొంత నిధులు రూ.2కోట్లతో చేయిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం తరహాలో మహానందిని సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, నాయకులు వీరారెడ్డి, శరభారెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, కుంచపు శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మజహర్ రహిమాన్(ఫైల్)

నందికొట్కూరు: ఏటీఎంలో పైసలు తెస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గాజుల మజహర్ రహిమాన్ అదృశ్యమైనట్లు బావమరిది ఎస్.ఎం. షఫి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్వీ రమణ సోమవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో ఏటీఎం నుంచి పైసలు తెస్తానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతను తెలుపు, పాచికలరు టీషర్టు, నల్ల ప్యాంట్, నల్ల టోపి ధరించాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌కు సెల్ నెంబరు 94902 64266కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐకి గాయాలు

నందికొట్కూరు: మద్దికెర పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సీ.చెన్నయ్య ఆదివారం రాత్రి 11.30 గంటలకు దామగట్ల నుంచి విజయవాడకు వెళ్లేందుకు నందికొట్కూరుకు బైక్‌పై బయల్దేరారు. పట్టణ సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద బైక్‌ను వెనుక నుంచి ఓ కారు ఢీకొట్టడంతో ఏఎస్ఐకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 సిబ్బంది కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్.ఐ ఎన్వీ రమణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్ని దర్యాప్తు చేస్తునట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నక్షత్రవనం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈఓ,అధికారులు

శ్రీశైలంటెంపుల్:శ్రీశైలదేవస్థానం పరిధిలోని హేమారెడ్డి మల్లమ్మ మందిరం ఎదురుగా నిర్మిస్తున్న సప్తగోకులం గణేశసదనం, ధర్మకాట, శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో నిర్మితమవుతున్న వసతిగృహాల పనులను దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. ఈఈ వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, డీఈఈ పి.చంద్రశేఖరశాస్త్రి, నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి అనుగ్రహం ప్రజలపై ఉండాలి



శ్రీచౌడేశ్వరి మాతకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు
- ఆత్మకూరులో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా ప్రత్యేక పూజలు



ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



నందికొట్కూరులో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: నియోజకవర్గ ప్రజలపై చౌడేశ్వరీదేవి అనుగ్రహం ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అమ్మవారి జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది నియోజకవర్గంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు మంచిగా పండించేందుకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా అందించాలని కోరుకున్నానన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు నిండుగా, మెండుగా ఇవ్వాలని కోరానన్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరిమాత జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని తోటగేరిలోవెలిసిన శ్రీచౌడేశ్వరి దేవాలయంలో చౌడేశ్వరి మాత అమ్మవారి జయంతి వేడుకలు సోమవారం భక్తజన సమూహం మధ్య ఘనంగా జరిగాయి. అమ్మవారిని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు భక్తులు దుస్సాలువా, పూలమాలతో వార్డు కౌన్సిలర్ మారబోతుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

బోనాల సమర్పణ

అమ్మవారు శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారు జయంతి వేడుకలు సందర్భంగా తోటగేరికి చెందిన భక్తబృందం అమ్మవారికి బోనాల ఉత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. చౌడేశ్వరి దేవి భక్తబృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ భాజభజంత్రీల మధ్య తోటగేరి నుంచి చౌడేశ్వరి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మారబోతుల రామకృష్ణ, శివశంకర్, పాణ్యం కృష్ణయ్య, గరిక శ్రీరాములు, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్ సురేష్, రవిప్రసాద్, విజయచౌదరి పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు, జలకనూరు, చౌట్కూరు గ్రామాల్లో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయాలలో తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారి పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భూవనకుండను సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.




ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు

పాములపాడు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో కొలువు దీరిన నందవరం చౌడేశ్వరీ అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ధూప దీప నైవేద్యాలు, కాయ, కర్పూరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వెలుగోడు: పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో సోమవారం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, పంచామృత అభిషేకం, అశ్వత్తర శతనామావళి, దేవి ఖడ్గమాలతో కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

కామేశ్వరీ దేవికి సారె



సారె తెస్తున్న మహిళలు

మహానంది: ఆషాడమాసం అమావాస్య సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి మహానందికి చెందిన మహిళలు పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. వారికి యువనేత శిల్పా కార్తీక్ రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. మహిళలు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, చీర సారె అందించి పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, ధర్మకర్త మల్లికార్జున పాల్గొన్నారు.

బరక సంజీవరాయుడికి అమావాస్య పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు నరహరి శర్మ, కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన యువతి మృతి

మహానంది: ఈ నెల 14న ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటుకు గురై నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామానికి చెందిన మణికుమారి(19) కోలుకో లేక ఆదివారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల్లు తెలిపారు. జయన్న, జయమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా, మణికుమారి పెద్దకుమార్తె. గారాబంగా పెంచుకున్న కుమార్తె పాముకాటుకు బలికావడంతో తల్లిదండ్రులు, శోకసంద్రంలో మునిగారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మహానంది: మసీదుపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మసీదుపురం గ్రామానికి చెందిన వీరు దీబగుంట్ల రహదారిలో పేకాట ఆడుతుండగా సమాచారం అందుకొని దాడులు నిర్వహించామన్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

గో సంరక్షణశాలను పరిశీలించిన నిపుణులు



గో సంరక్షణశాలలో సూచనలిస్తున్న నిపుణులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలను సోమవారం పలువురు నిపుణులు సందర్శించారు. దేవస్థాన అధికారులు విజ్ఞప్తి మేరకు డాక్టర్ ఈ. అరుణ, ఆత్మకూరు ఏరియా పశువైద్యశాల ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సి ధనుంజయ, వెలుగోడు ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు ఎం .రాంసింగ్, దుద్యాలకు చెందిన డాక్టర్ కె అశోక్ కుమార్, కొత్తపల్లికి చెందిన డాక్టర్ బి భువనేశ్వరి, సున్నిపెంటకు చెందిన జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ బి.మురళీకృష్ణ లు దేవస్థానం గో సంరక్షణశాలను పరిశీలించారు. గోవులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం టీకాలు వేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గో సంరక్షణ శాల సహాయ కార్యనిర్వాహణాధికారి ఎకె ధన పాల్, పర్యవేక్షకుడు బి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.